బాబోయ్ ..

- షాక్ కొడుతుండటంతో ప్రజల ఆందోళన
- లోఓల్టేజీతోనూ సతమతం

ఐరన్ విద్యుత్ స్తంభాలు

రొద్దం: మండల కేంద్రంలోని విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో తుప్పు పట్టిన ఐరన్ విద్యుత్ స్తంభాలు షాక్ కొడుతుండటంతో స్థానికులు బెంబేలెత్తిపోతున్నారు. చాలా చోట్ల ఐరన్ స్తంభాలకు ఎర్త్ వైర్లు కూడా లేకపోవడంతో వారి ఆందోళనలకు కారణమవుతోంది.

16 ఐరన్ విద్యుత్ స్తంభాలు

మండల కేంద్రంలో 16 ఐరన్ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. ప్రభుత్వ జూనియర్ కళాశాల దారి, పోలేపల్లి వీధి, బస్టాండ్ ఆవరణలోని బేకరీ వద్ద, పాత గ్రాంథలయం వద్ద, వైఎస్సార్ సర్కిల్ పీసీఎస్ కార్యాలయం వద్ద తుప్పుపట్టిన ఐరన్ విద్యుత్ స్తంభాలు ఉండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. మండల కేంద్రంలోని ఉన్న ఐరన్ విద్యుత్ స్తంభాలు మార్చాలని ప్రజలు కోరుతున్నారు. వెంటనే సిమెంట్ స్తంభాలు వేయాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

లోఓల్టేజీ సమస్యతో సతమతం

రొద్దం పరిధిలో లోఓల్టేజీ సమస్య కూడా వెంటాడుతోంది. 20 ఏళ్ల క్రితం గ్రామానికి మూడు విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఇప్పటిదాకా వినియోగానికి తగ్గట్టుగా ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటు చేయకపోవడంతో లోఓల్టేజీ సమస్యతో గ్రామస్తులు సతమతమవుతున్నారు. దీంతో రాత్రి వేళలో ఇళ్లలో ఫ్యాన్లు సైతం తిరగడం లేదని వాపోతున్నారు. ఎండాకాలం ప్రారంభం కావడంతో లోఓల్టేజీ సమస్య మరింత అధికంగా ఉంటుందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 20 ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు కూడా నాసిరకంగా ఉండడంతో పోలేపల్లి వీధిలో నిత్యం వైర్లు తెగి కింద పడుతున్నాయి. మండల కేంద్రంలో విద్యుత్ కనెక్షన్లు 2,800 ఉన్నాయి. లోఓల్టేజీ సమస్య తీరాలంటే మరో 160 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి.



పాత గ్రంథాలయం వద్ద ఉన్న విద్యుత్ స్తంభం



20 ఏళ్ల క్రితం రొద్దంలో ఏర్పాటు చేసిన విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు

ఎస్టిమేషన్ వేయాల్సి ఉంది

మండల కేంద్రంలో ఐరన్ విద్యుత్ స్తంభాలు ఉన్నాయి. అయితే వాటిని మార్చాడానికి ఎస్టిమేషన్ వేసి ప్రభుత్వానికి నివేదిక పంపుతాము. త్వరలోనే ఐరన్ స్తంభాలు మార్చడానికి చర్యలు తీసుకుంటాం. త్వరలోనే లోఓల్టేజీ సమస్యను కూడా పరిష్కరిస్తాం.

– శ్రీనివాసులు, ట్రాన్స్‌కో ఏఈ, రొద్దం



బస్టాండ్ ఆవరణలో శిథిలావస్థలో ఉన్న ఐరన్ స్తంభం

ఐరన్ స్తంభాలు మార్చాలి



రొద్దం పరిధిలో చాలో చోట్ల ఐరన్ విద్యుత్ స్తంభాలు తుప్పుపట్టి కూలడానికి సిద్ధంగా ఉన్నాయి. బస్‌స్టాండ్ ఆవరణంలో ఐరన్ స్తంభం పూర్తిగా శిథిలావస్థకు చేరింది. ప్రమాదం జరగకముందే ట్రాన్స్‌కో అధికారులు మేలుకోవాలి. ఐరన్ స్తంభాల స్థానంలో సిమెంట్ స్తంభాలు ఏర్పాటు చేయాలి. అదనంగా మరో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి లోఓల్టేజీ సమస్యను పరిష్కరించాలి.

– ఆర్‌పి రవిశేఖర్‌రెడ్డి, రొద్దం

కూటమి ప్రభుత్వాన్ని నమ్మి మోసపోయాం

- మాజీ మంత్రి ఉషశ్రీచరణ్ ఎదుట పుట్టగూర్లపల్లి వాసుల ఆవేదన

పరిగి: గత ఎన్నికల్లో అబద్ధపు హామీలిచ్చి నమ్మించి మోసం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబు, కూటమి నేతలను భవిష్యత్తులో మరోసారి నమ్మి మోసపోమని పుట్టగూర్లపల్లి గ్రామస్తులు వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్‌కు తెలిపారు. మండలంలోని పుట్టగూర్లపల్లిలో కాఫీ విత్ వైఎస్సార్‌సీపీ లీడర్స్ కార్యక్రమంలో ఉషశ్రీచరణ్ పాల్గొన్నారు. తొలుత కురుబల ఆరాధ్యదైవం భక్త కనకదాస విగ్రహం, భగీరథ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్తులతో కలిసి కాఫీ తాగారు. అనంతరం ప్రజలతో మమేకమై ప్రతి ఇంటా తిరుగుతూ బాగోగులను తెలుసుకున్నారు.

ఓట్లేసినందుకు బుద్ధి వచ్చింది

గత ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీలను చూసి దారుణంగా మోసపోయామని గ్రామస్తులు ఉషశ్రీచరణ్ ముందు గోడు వెల్లబోసుకున్నారు. గ్రామానికి రోడ్డు, డ్రైనేజ్ వ్యవస్థలు నేటికీ ఏర్పాటు చేయలేకపోయారన్నారు. గత ప్రభుత్వ హయాంలో అర్నెళ్ల కాలంలోనే దాదాపు 80 శాతం సంక్షేమ పథకాలను పొందామని, ప్రస్తుత ప్రభుత్వం నేటికీ ఒక్క హామీ నెరవేర్చలేకపోయారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఎప్పుడు ఎన్నికలు జరిగినా...

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి నేటికీ చంద్రబాబు ప్రజలకు అన్యాయం చేస్తూనే ఉన్నారని ఉషశ్రీచరణ్ విమర్శించారు. ఏ గ్రామానికి వెళ్లినా ప్రజలందరూ తమ ఆవేదనను చెప్పుకుంటున్నట్లు పేర్కొన్నారు. ప్రజలకు మంచి చేసిన వారిని మాత్రమే గుండెల్లో పెట్టుకుంటారని, ఆ కోవలో మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్, ఆయన కుమారుడు వైఎస్ జగన్ మొదటి వరుసలో ఉన్నారన్నారు. ఏరోజు ఎన్నికలు జరిగినా వైఎస్సార్‌సీపీ తిరుగులేని మెజార్టీతో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలించే శక్తి ఒక్క జగనన్నకు మాత్రమే ఉందన్నారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ నరసింహమూర్తి, ఎంపీటీసీలు నారాయణరెడ్డి, హనుమంతు, మారుతీరెడ్డి, స్థానిక నాయకులు రామాంజి, వెంకటేశ్, పవన్, గజేంద్ర రెడ్డి, హరి, రామకృష్ణారెడ్డి, నాగరాజు, రఘు, రామదాసు, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.



పుట్టగూర్లపల్లిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి కాఫీ తాగుతున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

తప్పిన పెను ప్రమాదం

సోమందేపల్లి: మండల కేంద్రమైన సోమందేపల్లిలోని జాతీయ రహదారి పక్కన ఆకతాయిలు గడ్డికు నిప్పు పెట్టారు. దీంతో దట్టంగా మంటలు చెలరేగి తహసీల్దార్ కార్యాలయంతో పాటు ప్రభుత్వ ఉన్నత పాఠశాల, గ్యాస్ గోడౌన్ వరకు మంటలు వ్యాపించాయి. మాజీ సర్పంచ్ డీసీ.ఈశ్వరయ్య స్పందించి తనతోటలో పనిచేసే వ్యక్తులతో మంటలు ఆర్పేందుకు యత్నించారు. మంటలు ఎక్కువ కావడంతో అగ్నిమాపక శాఖ సిబ్బందికు సమాచారం అందించడంతో వారు మంటలు అదుపు చేశారు.

ప్రణాళికలు సిద్ధం చేయండి

మడకశిర: నియోజకవర్గ అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలను సిద్ధం చేయాలని నియోజకవర్గ స్పెషల్ ఆఫీసర్ సూర్యనారాయణరెడ్డి కోరారు. పట్టణంలోని మండల ప్రజా పరిషత్ సమావేశమ మందిరంలో బుధవారం నియోజకవర్గంలోని అన్ని శాఖల మండల స్థాయి అధికారుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో శాఖల వారీగా అభివృద్ధి ప్రణాళికలపై చర్చించారు. తహసీల్దార్లు , ఎంపీడీఓలు, ఈఓఆర్‌డీలు, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్ సరఫరాకు చర్యలు

గుడిబండ: వ్యవసాయ రంగానికి నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుంటామని మడకశిర విద్యుత్‌శాఖ ఏడీ రఘు పేర్కొన్నారు. బుధవారం ఆయన మండల కేంద్రంలోని విద్యుత్ సబ్ స్టేషన్‌ను సందర్శించారు. కార్యాలయంలో రికార్డులు తనిఖీ చేసి వ్యవసాయ విద్యుత్ సర్వీసులతో పాటు గృహ వినియోగదారుల సర్వీసులు ఎన్ని ఉన్నాయని ఆరా తీశారు.

పూజల్లో పాల్గొన్న ఉషశ్రీచరణ్

సోమందేపల్లి: మండలంలోని మాగేచెరువులో కొల్హాపూరి మహాలక్ష్మి అమ్మవారి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం జరిగిన పూజల్లో వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీ చరణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి దర్శించుకున్నారు. వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ గజేంద్ర, జెడ్పీటీసీ సభ్యుడు అశోక్, సింగిల్ విండో చైర్మన్ ఆదినారాయణ రెడ్డి, ఎంపీటీసీ నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతలపై రైతుల కన్నెర్ర



అగళి సబ్ స్టేషన్ ఎదుట ధర్నా చేస్తున్న రైతులు

అగళి: విద్యుత్ సమస్యలు పరిష్కరించాలంటూ అగళి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట బుధవారం రైతులు ధర్న చేపట్టారు. రైతులు శివన్న, నాగరాజు, శ్రీనివాస్, మూడ్ల గిరియప్ప, కుమార్, గోవింద, బాబు, సత్యన్న తదితరులు మాట్లాడుతూ.. వ్యవసాయానికి రోజుకు 9 గంటలు విద్యుత్ ఇస్తామని చెప్పిన ప్రభుత్వం ,కనీసం నాలుగు గంటలు కూడా సరఫరా చేయడం లేదన్నారు. ఎండుతున్న పంటలను కాపాడుకునేందుకు విద్యుత్ కోతలు ఎత్తేయాలని డిమాండ్ చేశారు. సమస్య పరిష్కారానికి చొరవ తీసుకోకపోతే మండలంలోని రైతులు అంత కలసి ఉద్యమిస్తామన్నారు.

హక్కుల పరిరక్షణ అందరి బాధ్యత



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిరరూరల్: బాలల హక్కుల పరిరక్షణ అందరి బాధ్యతని, జిల్లాను బాలల స్నేహ జిల్లాగా ఏర్పాటుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. మండల పరిధిలోని గుండుమల ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో బుధవారం ఆర్డీటీ, ఐసీడీఎస్ ఆధ్వర్యంలో బాలల హక్కులపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆర్డీటీ టీమ్ లీడర్ రఘురాం, ఆదినారాయణ, ప్రిన్సిపాల్ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

రుణాలు రెన్యూవల్ చేయించుకోండి

పెనుకొండ: పంట రుణాలు రెన్యూవల్ చేయించుకోవాలని ఇస్లాపురం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం సీఈఓ హరి ఓ ప్రకటనలో తెలిపారు. రెన్యూవల్ చేయించుకున్న వారికి మాత్రమే ప్రభుత్వ రుణాలు అందుతాయన్నారు. మార్చి 15 లోగా రెన్యూవల్ చేయించుకోకపోతే అపరాధపు రుసుము విధించడం జరుగుతుందన్నారు.

క్లుప్తంగా

ప్లాస్టిక్ రహిత గ్రామంగా తీర్చిదిద్దాలి



చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలిస్తున్న శివనారాయణరెడ్డి

హిందూపురం అర్బన్: తడి చెత్త.. పొడి చెత్త వేరుచేయడంతో పాటు ప్లాస్టిక్ రహిత గ్రామంగా తూముకుంట పంచాయతీని తీర్చిదిద్దాలని డివిజనల్ పంచాయతీ అధికారి శివనారాయణ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హిందూపురం మండలం తూముకుంట గ్రామాన్ని ఆయన సందర్శించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామ కార్యదర్శి కెంచ రాయప్పకు పలు సూచనలు చేశారు.

'నరేష్‌కు వైఎస్సార్‌సీపీతో సంబంధం లేదు'

హిందూపురం అర్బన్: పట్టణంలోని శ్రీకంఠపురానికి చెందిన బెల్లం నరేష్‌కు వైఎస్సార్‌సీపీకి ఎలాంటి సంబంధం లేదని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక ఒక ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఆయన పార్టీలో ఉన్నారని, కేవలం మూడు నెలలు పార్టీకి పని చేశారని ఆ తరువాత పార్టీకి దూరంగా ఉంటూ వచ్చారన్నారు. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థి కోసం పని చేశారన్నారు. కొన్ని ఛానళ్లలో, పత్రికల్లో వైఎస్సార్‌సీపీ నాయకుడు నరేష్ ఆత్మహత్యాహత్నం అని రాయడాన్ని ఖండిస్తున్నామన్నారు.

రైతు విభాగం అధ్యక్షుడిగా వెంకటేష్‌రెడ్డి



పరిగి: వైఎస్సార్‌సీపీ రైతు విభాగం మండల అధ్యక్షుడిగా చెర్లోపల్లి వెంకటేష్‌రెడ్డి నియమితులయ్యారు. వైఎస్సార్‌సీపీ అధిష్టానం ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ చొరవతో వెంకటేష్‌రెడ్డిని నియమించినట్లు మండల కన్వీనర్ నరసింహమూర్తి ఓ ప్రకటనలో తెలిపారు. మండల నాయకులతో కలసి పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని వెంకటేష్‌రెడ్డి తెలిపారు.

కృష్ణా జలాలకు జలహారతి



గొల్లపల్లి రిజర్వాయర్‌లో కృష్ణా జలాలకు జలహారతి ఇస్తున్న మంత్రి సవిత

పెనుకొండ రూరల్: గొల్లపల్లి రిజర్వాయర్‌లోని కృష్ణాజలాలకు మంత్రి సవిత బుధవారం జలహారతి ఇచ్చారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ హంద్రీనీవా కాలువ పనుల కోసం రూ.3,650 కోట్లను ప్రభుత్వం కేటాయించిందన్నారు. త్వరలోనే పనులు ప్రారంభమవుతాయన్నారు. నియోజకవర్గంలో అన్ని చెరువులకు నీరు అందిస్తామన్నారు.

బాలికల ఫుట్‌బాల్ జట్టుకు అభినందన



బాలికల ఫుట్‌బాల్ జట్టుతో ఫుట్‌బాల్ అసోసియేషన్ సభ్యులు

హిందూపురం టౌన్: అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో ఈ నెల 10న ముగిసిన ఖేలో ఇండియా అస్మిత అండర్–13 బాలికల ఫుట్‌బాల్ పోటీల్లో విజేతగా నిలిచిన హిందూపురం అండర్–13 బాలికల ఫుట్‌బాల్ జట్టును హిందూపురం ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు జేవీ అనిల్‌కుమార్, ఉపాధ్యక్షుడు శేఖర్, కార్యదర్శి సలీమ్ అభినందించారు. బుధవారం పట్టణంలోని ఎంజీఎం క్రీడామైదానంలో అభినందన సభ నిర్వహించారు. కార్యక్రమంలో ఈసీ మెంబర్ ఆజాద్, కోచ్ విజయవాణి, పీడీలు లోక్‌నాథ్, భాస్కర్, హరిలు పాల్గొన్నారు.

ధర్నా విజయవంతం చేయండి



కరపత్రాలు విడుదల చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 24న విజయవాడలోని గ్రామీణాభివృద్ధిశాఖ కార్యాలయం వద్ద తలపెట్టిన ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బాల స్వామి పిలుపునిచ్చారు. బుధవారం సోమందేపల్లిలో అందుకు సంబంధించిన కరపత్రాలు విడుదల చేశారు. ధర్నాకు జిల్లా వ్యాప్తంగా కూలీలు తరలి రావాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కమిటీ సభ్యులు అంజినమ్మ, తిమ్మయ్య, ఆంజినేయులు, రంగస్వామి, రామాంజనమ్మ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

శుద్ధ జల ప్లాంట్ ప్రారంభం

హిందూపురం టౌన్: పట్టణంలోని సడ్లపల్లి ఎన్టీఆర్ కాలనీలోని ప్రభుత్వ పాఠశాలలో మనబడి- మన భవిష్యత్తు కార్యక్రమంలో భాగంగా బుధవారం శుద్ధ జల ప్లాంట్‌ను మండల విద్యాశాఖాధికారి గంగప్ప, వార్డు కౌన్సిలర్ సునీత ప్రారంభించారు. అలాగే పాఠశాలకు ఐరన్ అల్మారాను అందించారు.

మున్సిపల్ మార్కెట్ వేలాలు వాయిదా

మడకశిర: మడకశిర నగర పంచాయతీ పరిధిలోని మార్కెట్ వేలాలు ఈ నెల 20వ తేదీకి వాయిదా వేసినట్లు నగర పంచాయతీ కమిషనర్ రంగస్వామి తెలిపారు. బుధవారం మండకశిర నగర పంచాయతీ పరిధిలోని వారపు సంత, దినసరి మార్కెట్, బస్టాండ్ స్థలాల బహిరంగా వేలాలను ఉదయం 11 గంటలకు నిర్వహిస్తామని ప్రచారం చేశారు. అయితే ఈ బహిరంగ వేలాల్లో కాంట్రాక్టర్లు ఎవరూ పాల్గొనలేదు. దీంతో ఈ నెల 20వ తేదీకి వేలాలను వాయిదా వేసినట్లు కమిషనర్ రంగస్వామి పేర్కొన్నారు.

ద్విచక్ర వాహనం స్వాధీనం

రొళ్ల: మండల పరిధిలోని కొడగార్లగుట్ట 544ఈ జాతీయ రహదారి క్రాస్ నుంచి టీడీ పల్లికి వెళ్లే ప్రధాన రోడ్డు పక్కన అనుమానంగా ఆపి ఉంచిన ద్విచక్ర వాహనాన్ని (కేఏ06.ఈజే.7779) బుధవారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ద్విచక్ర వాహనానికి సంబంధించిన తాళాలు కూడా సైడ్ బ్యాగులోనే ఉంచారు. ద్విచక్ర వాహనాన్ని దొంగిలించి నడపలేక వదిలేసి వెళ్లారా? లేక మద్యం మత్తులో ఉంచి వెళ్లారా? అన్న విషయం పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది.

దానిమ్మ తోటకు నిప్పు



మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

మడకశిరరూరల్: మండల పరిధిలోని తడకలపల్లి గ్రామ సమీపంలో రైతు రాయప్ప సాగు చేసిన దానిమ్మ తోట పక్కన గడ్డికి బుధవారం గుర్తు తెలియని వ్యక్తులు నిప్పుపెట్టారు. దీంతో మంటలు చెలరేగి దానిమ్మ తోటకు వ్యాపించాయి. ఫైర్ సిబ్బంది మంటలను అదుపు చేశారు. అప్పటికే 20 పైగా దానిమ్మ, 20 పైగా చింత చెట్లు కాలిపోయినట్లు బాధిత రైతు రాయప్ప వాపోయారు. రూ.70 వేల వరకూ నష్టం జరిగిందన్నారు.

కందుల కొనుగోలులో రాజకీయాలు చేయకండి

రొద్దం: మండల కేంద్రంలో ఏపీ మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో కందుల కొనుగోలు కేంద్రం వద్ద కొందరు రాజకీయాలు చేస్తున్నారని రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం కొనుగోలు కేంద్రానికి 5 వేల సంచులు వచ్చాయన్నారు. అయితే కొందరు సంచులను రైతులకు ఇవ్వకుండా రాజకీయ నాయకులకు ఇచ్చారని ఆరోపించారు. మార్క్‌ఫెడ్ ప్రతినిధులు రైతులకు సర్ది చెప్పారన్నారు.

సమస్యలు పరిష్కరించండి

పెనుకొండ: పట్టణంలోని పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు ఈరేష్ వైస్ ప్రిన్సిపాల్‌కు బుధవారం వినతిపత్రం అందించారు. సమస్యలు పరిష్కరించని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపడుతామన్నారు.

గతంలో మంజూరైన ఇళ్లపై విచారణ

రొద్దం: మండల కేంద్రంలోని వైఎస్సార్ జగనన్న కాలనీలో నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారుల ఇళ్లు, ఇంటి స్థలాలపై బుధవారం రెవెన్యూ అధికారులు తనిఖీ చేసి, విచారణ చేపట్టారు. పలు విషయాలపై లబ్ధిదారులను విచారించారు.

పాఠశాలల విలీనంపై మంత్రి సమీక్ష

పెనుకొండ: పాఠశాలల విలీనంపై మంత్రి సవిత బుధవారం స్థానిక ఆర్అండ్‌బీ గెస్ట్‌హౌస్‌లో మండల విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులతో సమావేశం నిర్వహించి ఏ పాఠశాలను మూసి వేయకుండా చర్యలు చేపట్టాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను పరిగణలోకి తీసుకోవాలన్నారు.

పింఛన్లపై విచారణ

మడకశిరరూరల్: మండలంలోని వివిధ గ్రామాల్లో దీర్ఘకాలిక వ్యాధితో బాధపడుతూ మంచానికే పరిమితమై పింఛన్ పొందుతున్న వారి ఇంటి వద్దకు బుధవారం వైద్యుల బృందం పరిశీలించింది. 39 మందికిగాను 20 మందిని పరిశీలించారని మిగిలిన 19 మంది లబ్ధిదారుల పింఛన్‌ను గురువారం పరిశీలిస్తారని అధికారులు తెలిపారు.

రొళ్ల: మండల పరిధిలోని దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ మంచానికే పరితమైన 14 మందిని వైద్యుల బృందం బుధవారం పరిశీలించింది. మంచానికే పరిమితం కావడానికి గల కారణాలను కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు.

అగళి: మండలంలో దీర్ఘకాలిక వ్యాధులతో బాధపడుతూ రూ. 15 వేలు పింఛన్ పొందుతున్న 25 మందిని వైద్యుల బృందం బుధవారం విచారించింది. వారి ఆరోగ్య పరిస్థితి నివేదికలను ఉన్నతాధికారులకు పంపినట్లు అధికారులు తెలిపారు.



హెచ్‌డీ హళ్లి పంచాయతీలో లబ్ధిదారురాలిని పరిశీలిస్తున్న వైద్యుల బృందం

ప్రైవేటు బస్సు సిబ్బందిపై ఆటోడ్రైవర్ల దాడి

లేపాక్షి: మండలంలోని శిరివరం గ్రామంలో ప్రైవేటు బస్సుడ్రైవర్ సోమశేఖర్‌రెడ్డి, కండక్టర్, క్లీనర్‌లపై శిరివరానికి చెందిన ఆటోడ్రైవర్లు, ఆకతాయిలు బస్సులోనే దాడి చేశారు. ఈ సంఘటనతో ప్రయాణికులు ఆందోళనతో బస్సు దిగి పరుగులు తీశారు. వివరాల్లోకెళితే.. బుధవారం ఉదయం హిందూపురం నుంచి శిరివరం మీదుగా కర్ణాటకలోని చిక్కబళాపురంకు ప్రైవేటు బస్సు నడుపుతున్నారు. అయితే బస్సు ముందు ఆటోడ్రైవర్లు ఆటోలను అడ్డంపెట్టి ప్రయాణికులను ఆటోలో ఎక్కించుకున్నారు. దీతో డ్రైవర్, క్లీనరు, కండక్టర్ ఆటోడ్రైవర్లను మందలించారు. దీంతో మరోసారి ఇక్కడి రా మీ అంతు చూస్తామని ఆటోడ్రైవర్లు బెదిరించి వెళ్లిపోయారు. అయితే మధ్యాహ్నం చిక్కబళాపురం నుంచి శిరివరంలోకి ప్రైవేటు బస్సు ప్రవేశించగా కొందరు ఆటోడ్రైవర్లతో పాటు ఆకతాయిలు కలిసి కట్టెలు, రాళ్లతో డ్రైవర్, కండక్టర్, క్లీనర్‌లపై దాడి చేసి గాయపరిచారు. చికిత్స నిమిత్తం వారిని హిందూపురం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితులు పేర్కొన్నారు.

కార్మికుల సంఖ్య పెంచండి

పెనుకొండ: మున్సిపల్ కార్మికుల సంఖ్యను పెంచాలని సీఐటీయూ నాయకులు బాబావలి, నాయకులు వెంకటేష్, రైతు సంఘం ఉపాధ్యక్షుడు హరి.. నగర పంచాయితీ కమిషనర్ సతీష్‌కుమార్‌ను కోరారు. ఈ మేరకు బుధవారం ఆయనకు వినతి పత్రం అందించారు.

వైభవంగా రథోత్సవం



అమరాపురం: అలంకరణలో కెంచమాంబదేవి

మడకశిర: పట్టణంలో వెలసిన మిట్టబండ ఆంజనేయస్వామి బ్రహ్మరథోత్సవాన్ని బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఉదయం నుంచే ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారిని రథంపై కొలువుదీర్చి రథోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. వేలాది మంది భక్తులు రథోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. అయ్యప్పస్వామి సేవా సమితి, బ్రాహ్మణ సంఘం, ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

అమరాపురం: మండల కేంద్రంలో వెలసిన లక్ష్మీ వెంకటేశ్వరస్వామి బ్రహ్మ రథోత్సవం బుధవారం వైభవంగా జరిగింది. ఉదయం అర్చకులు శ్రీనిధి భట్టాచార్యులు స్వామి వారికి సుప్రభాతసేవ, రుద్రాభిషేకం, పంచామృతాభిషేకం తదితర పూజలు నిర్వహించారు. అలాగే ఆలయం ముందు అర్చకులు వివిధ రకాల హోమాలను నిర్వహించారు. అనంతరం గోవింద నామస్మరణతో రథాన్ని బ్యాంకు వరకూ లాగారు. ఈ సందర్భంగా భక్తులు అరటి పండ్లు, బెల్లం బొరుగులు, పూలను రథంపైకి విసిరి మొక్కులు చెల్లించారు. వచ్చిన భక్తులకు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు చంద్రశేఖర్‌గుప్తా కుటుంబ సభ్యులు అన్నదానం చేశారు.

ఆలయ వార్షికోత్సవం వేడుకలు

రొళ్ల: మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణంలో వెలసిన శనీశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. వేకువజామున నుంచి స్వామివారికి సుప్రభాత సేవలు, నవగ్రహారాధన, తులసి పూజ, అంకురార్పణ, అభిషేకం తదితర పూజలు చేశారు. వార్షికోత్సవం సందర్భంగా భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు.

ముగిసిన కెంచమాంబదేవి ఉత్సవాలు

అమరాపురం: మండల పరిధిలోని గౌడనకుంటలో వారం రోజులుగా నిర్వహించిన కెంచమాంబదేవి ఉత్సవాలు బుధవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా అర్చకులు అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రంగులు చల్లుకుని హోలీ నిర్వహించారు.



అమరాపురం: అన్నదానం చేస్తున్న దృశ్యం



రొళ్ల శనీశ్వర ఆలయంలో హోమం నిర్వహిస్తున్న దృశ్యం



అమరాపురం: లక్ష్మీ వేంకటేశ్వరస్వామి రథాన్ని లాగుతున్న భక్తులు



మడకశిర: మిట్టబండ ఆంజనేయస్వామి రథోత్సవాన్ని నిర్వహిస్తున్న దృశ్యం